క్లుప్తంగా

ఆర్డీఓను కలిసిన ఏసీపీ



ఆర్డీఓ చంద్రకళకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీపీ కిషన్, సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన రెవెన్యూ బదిలీలలో చేవెళ్ల ఆర్డీఓగా వచ్చిన చంద్రకళను ఏసీపీ బి.కిషన్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆమెను కలిసి స్వాగతం తెలిపారు. అనంతరం చేవెళ్ల డివిజన్ పరిస్థితులపై వారు చర్చించారు. ఏసీపీ కిషన్ వెంట సీఐ భూపాల్‌శ్రీధర్ ఉన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



దీక్షలో పాల్గొని పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కేశంపేట: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని అంజనేయస్వామి దేవాలయంలో జూలై 17 నుంచి బుధవారం వరకు భక్తులు, గ్రామస్తులు చాతుర్మాస్యవ్రత దీక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ దీక్ష ముగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దైవచింతన కలిగి ఉండటంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. శ్రీకిషన్‌ప్రభు గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మళయాళస్వామి ఆశ్రమం నుంచి దయానందస్వామి, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథం, నారాయణరెడ్డి, యాదయ్యచారి, దేవస్థాన కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సంస్థ ప్రతినిధులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక బాలుర పాఠశాలలో సుమారు రూ.15లక్షల నిధులతో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి జెడ్ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్, రౌండ్ టేబుల్ ఇండియా 303 అనే స్వచ్ఛంద సంస్థ వారు ముందుకొచ్చారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సంస్థల ప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టును మూడునెలల్లో పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తమవంతుగా సాయం చేసేందుకు ముందుకొచ్చిన ప్రతినిధులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధమైన కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ అక్బర్, కౌన్సిలర్ శ్వేత పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్‌తండా పంచాయతీ రాగ్యతండాలో నూతనంగా నిర్మించిన లలితాంబికదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పలువురు నాయకులతో కలిసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, రవినాయక్, దశరత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్లలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం రూ.కోటి నిధులతో చేపట్టనున్న మండల కేంద్రంలో విలేజ్ రోడ్డు పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమస్యల పరిష్కారానికి నిధులు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. చేవెళ్ల విలేజ్ రోడ్డుకు సంబంధించి కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పలు గ్రామీణ రోడ్లకు సంబంధించిన నిధులు కూడా ప్రభుత్వం విడుదల చేస్తోందని, ఆ నిధులతో నియోజకవర్గంలోని అన్ని రోడ్లు అభివృద్ధి చెందుతాయన్నారు. చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల గేట్ నుంచి ప్రొద్దటూరు గేట్‌వరకు ఆర్అండ్‌బీ రోడ్డుకు 24కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో వేసే రోడ్డుకు మంత్రితో శంఖుస్థాపన కార్యక్రమం అనివార్య కారాణాలతో వాయిదా పడిందని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నియోజకవర్గ నాయకులు వసంతం, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయ కుడు బండారు ఆగిరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఎం.కృష్ణారెడ్డి, రాములు, పి.ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పొట్ట దయాకర్, జనార్ధన్, ప్రభాకర్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గంలోని 99 మందికి ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య పంపిణీ చేశారు. ఐదు మండలాలకు చెందిన 99 మందికి గాను 43లక్షల 37వేల రూపాయల చెక్కులు వచ్చినట్లు తెలిపారు. పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు వసంతం, దర్శన్, శ్రీనివాస్గౌడ్, పెంటయ్యగౌడ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రఘునాయక్

అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రఘునాయక్

షాద్‌నగర్: లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి వెనక బీఆర్ఎస్ నేతల హస్తం ఉందని, అభివృద్ధి పనిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రఘునాయక్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడి ఘటన వెనక మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్ర పన్నుతున్నారన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళనను అడ్డుకునేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా అసాంఘీక శక్తులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీఆర్ఎస్ నేతల ఉడత ఊపులకు తాము భయపడేది లేదన్నారు. లగచర్ల ఘటన వెనక ఉన్న పాత్రదారులు, సూత్రదారులు ఎవరో త్వరలో ప్రజలకు తెలుస్తుందన్నారు. ఈ ఘటనపై చట్టం తన పని తాను చేస్తుందన్నారు. లేనిపోని గొడవలు సృష్టిస్తూ అరాచకాలకు బీఆర్ఎస్ నేతలు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని అడ్డుకోవడం సరికాదు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: లగచర్లలో రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను పోలీసులు మన్నెగూడలో అడ్డుకోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీపై ప్రభుత్వానికి సరైన స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు. ఎంపీ డీకే అరుణ తన సొంత నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మాసిటీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుంటే మన్నెగూడ వద్ద పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటును మొదటి నుంచి రైతులు వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్నారని, వారి ఇబ్బందులను తెలుసుకునేందుకు ఎంపీ వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎక్కడికైనా వెళ్లే హక్కు అందరికీ ఉంటుందన్నారు. కానీ పోలీసులు హక్కులను కాలరాస్తూ ఎంపీని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. అదే నియోజకవర్గానికి సీఎం సోదరుడు వెళ్తుంటే లేని అడ్డంకులు ఎంపీ వెళ్తే ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. ఎంపీ అరుణను పోలీసులు అడ్డుకోవడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేకు చెక్కులను అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షాద్‌నగర్ యాదవ మహాసభ నాయకుడు నడికూడ రఘునాథ్ యాదవ్ రూ.1లక్షా 11వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి రూ.1లక్ష విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమవంతుగా సహాయ సహకారాలు అందించడం హర్షణీయమన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ పేద విద్యార్థుల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, బక్కన్న యాదవ్, భీమయ్యయాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: తిమ్మాపూర్ 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఏఈ రమేశ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు మున్సిపాలిటీ, కొత్తూరు తండా, నందిగామ మండలంలోని నాట్కో, రంగాపూర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు, ప్రజలు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డుకిరువైపులా చెట్లకొమ్మల తొలగింపు



దోజర్‌తో ముళ్ల చెట్ల తొలగిస్తున్న మాజీ ఉపసర్పంచ్ రవీందర్‌ముదిరాజ్

నందిగామ: రోడ్డుకిరువైపులా అలుముకున్న చెట్ల కొమ్మలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఓ యువకుడు సొంత డబ్బులతో చెట్లకొమ్మలను తొలగించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. మండల పరిధిలోని నర్సప్పగూడ నుంచి చేగూరుకు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు అలుముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ నీరటి రవీందర్ ముదిరాజ్ స్పందించారు. తానే సొంత డబ్బులతో బుధవారం సుమారు 4 కిలో మీటర్ల మేర రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల చెట్లను డోజర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మండల పశువైద్యురాలు శిరీష



పశువులను పరిశీలిస్తున్న వైద్యులు

చేవెళ్ల: పాడిపశువులను రైతులు జాగ్రత్తగా కాపాడుకోవాలని, వాటికి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యురాలు శిరీష, పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ జయసుధ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల వద్ద ఉన్న పాడిపశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భకోశ సంబంధించిన వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించి అవసరమైన పశువులకు చికిత్స చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాడిపశువుల అభివృద్ధితో ప్రజలకు ఆదనపు ఆదాయం సమకూరుతుందని, వ్యాధులపై జాగ్రత్తలు తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. సీజనల్‌గా పశువుల్లో వచ్చే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడూ పశువులను గమనిస్తూ వాటిలో వచ్చే తేడాలను గుర్తించి వ్యాధులను నిర్ధారించుకోవాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల కృషితో బడికి రంగులు



ముస్తాబైన ఎన్కెపల్లి పాఠశాల

బాలల దినోత్సవానికి ముస్తాబైన ఎన్కెపల్లి పాఠశాల

మొయినాబాద్‌రూరల్: దాతల ప్రోత్సాహం, కృషితో ఎన్కెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేడు బాలల దినోత్సవానికి కొత్త రంగులు, బొమ్మలతో ముస్తాబైందని పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మారెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనైటెడ్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్‌లాండ్ వారి దాతృత్వం, ఐ వలంటీర్ సహకారంతో గోడలపై వైట్‌వాష్, రంగు రంగుల డిజైన్స్, వివిధ మార్గదర్శకాల పదాలు, కొటేషన్స్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దాతల సహకారం విద్యార్థులు, గ్రామస్తులు ఎప్పటికి మరచిపోలేరని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా పేద విద్యార్థులు చదువుతున్నారని, దాతలు వారి ఉన్నత చదువులకు సహకరించాలని కోరారు. బాలల దినోత్సవానికి పాఠశాలను ముస్తాబు చేయించడం సంతోషకరమని లక్ష్మారెడ్డి, పోచయ్యలు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న నాయకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహంకాళి, బీరప్ప, మల్లన్న దేవాలయాల్లో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రజలు దేవాలయాల వద్దకు వెళ్లినప్పుడు నిష్ఠతో పూజలు చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు సూద యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, సత్తయ్య, యాదయ్య, కుమార్, నర్సింలు, భాస్కరాచారి, మహిపాల్‌రెడ్డి, శంకర్, ఆంజనేయులు, నరేశ్‌గౌడ్, రామకృష్ణ, సాయిలు, మల్లయ్యగౌడ్, మహేశ్, ఆంజనేయులు, మహేందర్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

మాజీ ఉపసర్పంచ్ కావ్య



పాఠశాలకు పుస్తకాలను అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ కావ్య, కృష్ణాగౌడ్

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే గ్రామాల అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కందవాడ మాజీ ఉపసర్పంచ్ జి.కావ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్‌లు అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రరీకి బుధవారం కావ్య, కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ సహకారంతో 20వేల పుస్తకాలను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు రీడింగ్ అలవాటు చేసేందుకు లైబ్రరీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి లైబ్రరీలో విద్యార్థులకు ఆసక్తి కలిగించే పుస్తకాలు ఉంటేనే వారు రీడింగ్ వైపు దృష్టిపెడతారన్నారు. అందుకు తగిన పుస్తకాలు లైబ్రరీలో ఉండాలనే ఉద్దేశంతో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థను కలిసి బుక్స్‌ను ఇవ్వాలని కోరటంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 20వేల పుస్తకాలను అందజేశారన్నారు. అడిగిన వెంటనే సహకరించిన సంస్థకు వారు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన కావ్య, కృష్ణగౌడ్‌లు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ప్రతి ఏడాది పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవటంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు కూడా అందజేస్తారన్నారు. జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ పెద్దఎత్తున పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, రజినీ, దర్శన్‌గౌడ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రిన్సిపాల్ విద్యుల్లత



టాస్‌వేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, టెన్నీస్‌కాయిట్, షార్ట్‌పుట్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను ప్రిన్సిపాల్ విద్యుల్లత టాస్‌వేసి ప్రారంభించారు. ప్రతీ విద్యార్థి తమకు ఇష్టమైన క్రీడల్లో ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించి గుర్తింపును తెచ్చుకోవాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వివిధ గురుకులాలల నుంచి తరలివచ్చిన విద్యార్థినులకు, సిబ్బందికి అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



షాబాద్: ఏట్లఎర్రవల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ



షాద్‌నగర్‌రూరల్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, రంగంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. కుటుంబ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా బన్సీలాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సర్వేలో నమోదు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. కుటుంబ వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలందరూ సహకరించాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, ఎన్యుమరేటర్లు లలిత,మంజుల,కారోబార్ శివ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

షాబాద్: సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఎన్యుమరేటర్లు పనిచేయాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం ,నాగర్‌గూడ, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, మాచన్‌పల్లి గ్రామాల్లో సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు అన్ని కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రజలు ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచుకొని ఎన్యుమరేటర్లు అగిడిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏఓ వెంకటేశం తదితరులు ఉన్నారు.